క్లుప్తంగా

వైభవంగా వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి



పూజలు చేస్తున్న భక్తులు

కవిటి: మండలంలోని శిలగాంలో శనివారం కళింగవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వర జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు చెన్నూరు రమేష్ దంపతులచే శాస్త్రోక్తంగా సాయిపంతులు ఆధ్వర్యంలో ప్రధాన పూజ చేశారు. ఈ వేడుకల్ని పురస్కరించుకుని పలువురు మహిళలచే సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహ స్వామి సంబరాలు



ఉత్సవంలో తప్పెటగుళ్ల ప్రదర్శన

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అమలపాడు గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామివారి సంబరాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండేళ్లకు ఒకసారి సంబరాలను ఎంతో వైభవంగా జరుపుతున్నారు. దీనిలో భాగంగానే ఈ ఏడాది కూడా జరిపారు. స్వామి వారిని మేళతాళాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు ఉన్నారు.

డంపింగ్ యార్డులా మార్చేస్తున్నారు!



కళాశాల మైదానంలో వేసిన చెత్త

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని స్థానికులు కొంతమంది డంపింగ్ యార్డులా మార్చేస్తున్నారు. పట్టణవాసులకు ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు ఎంతో ఆసరాగా ఉన్న ఈ మైదానానికి ప్రహరీ లేదు. దీంతో కొంతమంది చిరు వ్యాపారులు, ఇతర వాణిజ్య సముదాయాలకు చెందిన నిర్వాహకులు విచ్చలవిడిగా చెత్తను కళాశాల ఆవరణంలో పడేస్తున్నారు. దీంతో ఎంతో ప్రశాంతమైన వాతావరణం కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం దుర్గంధభరితంగా మారుతోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

సంపద సృష్టి కేంద్రం పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట: పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న చెత్తతో సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీకి ఆదాయ వనరులు సృష్టించాలని డీఎల్‌పీవో వి.రమణ అన్నారు. మండలంలోని బెంకిలి పంచాయతీలోని చెత్తతో సంపద సృష్టి కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా చెత్తతో సంపద తయారీ కేంద్రం నిర్వహణపై తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఈవోపీఆర్డీ డి.వి.వెంకటేశ్వరులు, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, గ్రీన్‌గార్డ్ కె.చిరంజీవి పాల్గొన్నారు.

సందడిగా గరుడ వాహనసేవ



గరుడవాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నందిగాం: పెంటూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయ 22వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజైన శనివారం గరుడవాహన సేవ సందడిగా సాగింది. స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, నిత్యప్రోబోధిక, అష్టదిక్పాలకావాహన, గరుడ ప్రతిష్ట, ధ్వజారోహణ, మంగళశాసనం అనంతరం కోలాటంతో గరుడవాహన సేవ భారీ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని పలు గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సాహం ఉత్సవమై..



ఇచ్ఛాపురం రూరల్: లండపుట్టుగలో గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన ఆదిత్యుని ఉత్సవ విగ్రహం



ఇచ్ఛాపురం రూరల్: తప్పెటగుళ్లు కళాకారుల ప్రదర్శన



ఇచ్ఛాపురం రూరల్: నృత్యం చేస్తున్న కాళీమాత వేషధారణ కళాకారుడు రమేష్



ఇచ్ఛాపురం రూరల్: విశాఖ మహిళా కళాకారుల కోలాట ప్రదర్శన



ఇచ్ఛాపురం రూరల్: అగ్గి బరాటాలతో విన్యాసం చేస్తున్న ఒడిశా కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామ దేవతల చల్లదనాలతో పల్లెలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. మండలంలోని కమలాయిపుట్టుగ–లండపుట్టుగలో జరుగుతున్న అసిరిపోలమ్మ గ్రామ దేవత ఉత్సవాలు అంబరాన్ని తాకుతున్నాయి. ఉత్సావాల్లో భాగంగా శనివారం ప్రదర్శించిన తప్పెటగుళ్లు, కాళీమాత వేషధారణ, మహిళల కోలాటంతో పల్లె పులకించిపోయింది. ఉత్సవాన్ని తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు.

కేసరపడలో..

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామదేవత సింధుపోలమ్మ ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్న ఉత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. ఇందులో భాగంగా శనివారం కూడా అమ్మవారిని గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. అమ్మవారితోపాటు కాళికావేషధారణ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. మరోవైపు ఎగ్జిబిషన్ సందడి కూడా నెలకొంది.



కంచిలి: అమ్మవారి ఊరేగింపులో కాళికా నృత్యం



కంచిలి: ఊరేగింపులో బాలికల నృత్యం



కంచిలి: గ్రామంలో ఏర్పాటు చేసిన కళారూపకం

చంద్రబాబు హామీలను నమ్మని ప్రజలు



విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు

• వైఎస్సార్‌సీపీ నాయకులు

కోటబొమ్మాళి: ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విశ్వసనీయతలేని చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మహిళలతోపాటు అన్నివర్గాల ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పక్షాన నిలబడ్డారని చెప్పారు. వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు రోణంకి మల్లయ్య, మండల పార్టీ కన్వీనర్ నూక సత్యరాజు, మండల విప్ బొడ్డు అప్పన్న తదితరులు కోటబొమ్మాళిలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో టీడీపీ నాయకులు ఎన్నో అసత్యపు ప్రకటనలు చేస్తూ లబ్ధిపొందాలని భావించారన్నారు. అయితే ప్రజలు వాటిని తిరస్కరించి.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపారన్నారు. జూన్ నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపులో టెక్కలిలో గెలిచి జగన్‌కు కానుకగా ఈ నియోజకవర్గాన్ని కానుకగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పేడాడ వెంకటరావు, కవిటి రామరాజు, మెట్ట సింహాచలం, కోతి చిన్నారావు, బగాది దివాకర్, మెట్టు వాసు ఉన్నారు.

సూక్ష్మ కళాకారుడికి సత్కారం



రమేష్ ఆచారిని సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ప్రముఖ సూక్ష్మ కళాకారులు కొత్తపల్లి రమేష్ ఆచారికి అరుదైన గౌరవం దక్కింది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి గాంధీనగర్ ఎస్‌బీఎస్ స్కూల్ వద్ద ప్రిన్సిపాల్ వెంకట్రావు మాస్టారు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రమేష్ ఆచారిని ఘనంగా సత్కరించారు. ఆయన సేవలకు కొనియాడారు. మన సంస్కృతి..సంప్రదాయాలను గౌరవిస్తూ ఆచారి తయారీ చేస్తున్న సూక్ష్మ ఆకృతులు వెలకట్టలేనివని అన్నారు. మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర ఆరాధాన ఉత్సవం



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలో కామాక్షి స్వర్ణకార సేవా సంఘం సభ్యులు, విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధాన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మంగారి ఆలయంలో ఉదయం ఐదు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఊరేగింపులో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో శ్రీకంచి కామాక్షి స్వర్ణకార సేవా సంఘం, శ్రీగోవిందబాంబ సమేత వీర బ్రహ్మేంద్రమ్మ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

కాశీబుగ్గ: పలాసలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు శనివారం జరిగాయి. ఉదయం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం చేసి మంగళహారతులు అర్పించారు. మామిడి, జీడి, కమలా పండ్లను నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. రాత్రి అమ్మవారి ఊయ్యాల సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం ప్రతినిధి మల్లా కృష్ణారావు, మహిళ సంఘం ప్రెసిడెంట్ సౌజన్య, సెక్రటరీ పుష్ప, శ్రీదేవి, పి.వి. సతీష్, తంగుడు వైకుంఠరావు ఉన్నారు.

నేటి నుంచి మద్భాగవతం జ్ఞానయజ్ఞం

టెక్కలి: స్థానిక కంద్రవీధిలోని చంద్రశేఖర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నుంచి మద్భాగవతం సప్తాహం జ్ఞానయజ్ఞం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాధాకృష్ణ సంకీర్తన ప్రేమ మండలి నిర్వాహకులు శనివారం తెలిపారు. మహంత్ మదన్ గోపాల్‌దాస్ మహారాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా భాగవత ఉపన్యాసం, అష్ట ప్రహరీ హరినామ సంకీర్తన, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కవిటి: మండల కేంద్రం కవిటిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు సంబంధిత విద్యుత్‌శాఖ వర్గాలు తెలిపాయి. కవిటి, కొత్తూరు, ప్రగడపుట్టుగ, గొంద్యాలపుట్టుగ గ్రామాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు జీడిరైతుల సమావేశం

కాశీబుగ్గ: జీడి రైతుల సమావేశాన్ని ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్టు జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గలోని గణపతి రెసిడెన్స్ సమీపంలో కావ్య నర్సింగ్ హోమ్ వెనుక వీధిలో ఉన్న సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి రైతులు హాజరు కావాలని కోరారు.

నేడు యూవీవీ 22వ వార్షికోత్సవం

కాశీబుగ్గ/పలాస: ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యూవీవీ)22వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్టు వేదిక ప్రధాన కార్యదర్శి బొడ్డ చిన్నారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలాస మండలం నీలావతి గ్రామంలోని ప్రజా గ్రంథాలయం వద్ద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నిక, 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తామన్నారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

ఎంఎంఎస్‌లో పక్కాగా ఆడిట్



ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: మండల మహిళా సమాఖ్యలో ఆడిట్‌ను పక్కాగా నిర్వహిస్తున్నట్టు ఏపీఎం శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నుంచి ఆడిట్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ప్రతీ పైసా ఖర్చుకు పారదర్శకంగా ఆడిట్ నిర్వహిస్తామన్నారు. స్వయంశక్తి సంఘాల వారీగా రికార్డుల తనిఖీ చేపట్టి ఆడిట్‌లో అభ్యంతరాలను కోరుతామన్నారు. కార్యక్రమంలో ఎల్‌సీ సాహు, స్త్రీ నిధి మేనేజర్ కె.రాము ఉన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి



సిబ్బందితో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

సోంపేట: ఖరీఫ్ సీజన్‌కు పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సోంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కె.జగన్‌మోహనరావు తెలిపారు. బారువ ఆర్‌బీకేని వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తితో కలసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ.. మండలంలో రెండు వేల ఎకరాల్లో పచ్చిరొట్ట విత్తనాలు రైతులు వాడుతున్నారన్నారు. విత్తనాలు అవసరమైన రైతులకు 50 శాతం రాయితీతో అందించేందుకు వ్యవసాయశాఖ పేర్ల నమోదు ప్రక్రియను ప్రారంభించిందన్నారు. వచ్చే వారంలో విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఒక ఎకరంలో పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేస్తే దానినుంచి ఐదు టన్నుల పచ్చిరొట్ట దిగుబడి ఉంటుందన్నారు. ఎకరం నేలలో సక్రమంగా కలియదున్నితే 30 కిలోల నత్రజని, 7.5 కిలోల భాస్వరం, 15 కిలోల పొటాష్ అందిస్తుందన్నారు. పచ్చిరొట్ట ఎరువు వేయడం వలన భూసారం పెరుగుతుందని వివరించారు.

దివ్యాంగు విద్యార్థుల గుర్తింపునకు సర్వే



ప్రగడపుట్టుగలో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్న ఉపాధ్యాయులు

కవిటి: దివ్యాంగు విద్యార్థుల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు ఎంఈవో ధనుంజయమజ్జి చెప్పారు. పుట్టుకతో వివిధ వైకల్యాల వల్ల చదువుకు ఇబ్బంది పడుతున్న బాలబాలికలకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల ఒకటి నుంచి జూన్ తొమ్మిదో తేదీ వరకు 40 రోజులపాటు 0 నుంచి 18 సంవత్సరాల్లో ఉన్న దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా కవిటి మండలంలో సహిత ఉపాధ్యాయులు కృష్ణారావు, అరుణ్ కుమార్‌లు ప్రగడపుట్టుగ, కవిటి కొత్తూరు, సీహెచ్ కపాసుకుద్ది గ్రామాల్లోని అంగన్ కేంద్రాలు, సచివాలయాలను శనివారం సందర్శించి పిల్లల వివరాలను సేకరించినట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు పది మందికి పైగా దివ్యాంగ విద్యార్థులను గుర్తించామన్నారు. వీరిని వారికి సమీపంలో ఉన్న పాఠశాలలో చేర్పిస్తామన్నారు. అలాగే వారికి అవసరమైన ఉపకరణాలను అందిస్తామని చెప్పారు.


పలాసలో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం



దువ్వాడ మధుకేశ్వరరావు

వజ్రపుకొత్తూరు రూరల్: పలాస ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన డాక్టర్ సీదిరి అప్పలరాజు ఘన విజయం సాధించడం ఖాయమని పీఏసీఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు అన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలాస నియోజకవర్గంలో ఫ్యాన్‌గాలి జోరుగా వీచిందన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధిపొందినవారంతా ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. ప్రధానంగా మహిళలు ఓటు వేసేందుకు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. మహిళల ఓటు శాతం పెరగడమే వైఎస్సార్‌సీపీ గెలుపునకు శుభసూచికమన్నారు.

నేటినుంచి కొత్తపేటలో గ్రామదేవత ఉత్సవాలు



ముస్తాబైన పెద్దమ్మతల్లి ఆలయం

వజ్రపుకొత్తూరు: మండలంలోని తీర ప్రాంత గ్రామమైన కొత్తపేటలో గ్రామ దేవత పెద్దమ్మ తల్లి ఉత్సవాలను ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ అంబటి శ్రీను తెలిపారు. ఉత్సవాల కోసం అమ్మవారి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. అన్నివీధుల్లో విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేశామన్నారు. తొలి రోజున దేవరను తీసుకురావడంతో పాటు పగటి వేషాలు, స్టేజీ ఈవెంట్స్, పౌరానిక ఘట్టాలు, అమ్మవారికి చల్లదనం, ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించే కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. మంచి వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

40 మద్యం బాటిళ్లతో మహిళ అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సెబ్ సిబ్బంది

కోటబొమ్మాళి: అక్రమంగా మద్యం బాటిళ్లను కలిగి ఉన్న మహిళను అరెస్టు చేసినట్టు కోటబొమ్మాళి ఎస్ఈబీ సీఐ గాయత్రి శనివారం తెలిపారు. సంతబొమ్మాళి మండలం పెద్దమర్రిపాడుకు చెందిన రెయ్యి లక్ష్మి ఇంటిపై తనసిబ్బందితో దాడిచేసి అక్రమంగా నిల్వ ఉంచిన 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆమెపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ



నిహాన్ కశ్యప్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట గ్రామానికి చెందిన మొదలవలస నిహాన్ కాశ్యప్ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో జాతీయస్థాయితో మెరిశాడు. ఈ ఏడాది జనవరి 28వ తేదీన జరిగిన పరీక్షలో 300 మార్కులకు 265 సాధించి ఆలిండియాస్థాయిలో రెండువేల ర్యాంకు సాధించాడు. దీంతో ఐదు స్కూళ్లలో సీటు దక్కగా.. చివరకు చిత్తూరు జిల్లాలోని కలికిరి సైనిక్ స్కూల్‌లో అడ్మిషన్‌కు అంగీకరించారు. కేశవరావుపేటకు చెందిన మొదలవలస వంశీకృష్ణ, లక్ష్మి తల్లిదండ్రులు. నిహాన్ కాశ్యప్ తండ్రి వంశీకృష్ణ ఓ కార్పొరేట్ సంస్థలో ఉన్నత ఉద్యోగం చేస్తుండగా.. తల్లి లక్ష్మి గృహిణి.